ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
7
గురువారం 25 సెప్టెంబరు 2025

సోలార్ చె(మె)ప్మా


కడపలో ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెల్

- సూర్యఘర్‌కోసం డ్వాక్రా ఆర్పీలకు అధికారుల టార్గెట్‌లు
- ఒక్కో ఆర్పీ వంద కనెక్షన్లు చేయాలంటూ హుకుం
- అవగాహన కల్పించాలన్న ప్రభుత్వం..
- టార్గెట్ ఇచ్చి బలవంతంగా రుద్దే యత్నం

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు హయాంలోనే డ్వాక్రా సంఘాలు పురుడు పోసుకున్నాయి. మహిళా సాధికారత సాధించాయి. పొదుపే కాదు.. ఆ సంఘాలు ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలను జనాల్లోకి తీసుకెళుతుంటాయి. ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతుంటాయి. ప్రభుత్వం కూడా వివిధ పథకాలపై డ్వాక్రా సంఘాల ద్వారా జనానికి అవగాహన కల్పిస్తూ వచ్చేవి. అయితే ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునే విషయంలో కడపలో మెప్మా అధికారులు డ్వాక్రా సంఘాల ఆర్పీలకు టార్గెట్ ఇచ్చి చుక్కలు చూపిస్తున్నారు. అధికారుల వత్తిడి భరించలేక ఆర్పీ వద్దు.. డ్వాక్రా సంఘాలు లేకపోయినా ఫర్వాలేదనే స్థాయికి ఇప్పుడు ఆర్పీలు వచ్చారు. ప్రైవేటు సంస్థ కోసం అధికారులు ఇంతలా వత్తిడి చేయడం కడపలో తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై ఇప్పటికే ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో మెప్మా తీరును ఎండగడుతూ కథనాలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా ఆర్పీలపై వత్తిడి నిలిచిపోయింది. అయితే కడపలో కొనసాగుతుండడం గమనార్హం.

సౌర విద్యుత్

సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇళ్లపైనే సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. దీంతో అధిక కరెంటు బిల్లు నుంచి ఉపశమనం పొందవచ్చు. దీని కోసం ప్రభుత్వం ఒక్క కిలోవాట్ సామర్థ్యానికి రూ.30వేలు, 2 కిలోవాట్స్‌కు రూ.60వేలు, 3 కిలోవాట్స్‌కు రూ.78వేలు చొప్పున రాయితీ ఇస్తుంది. యూనిట్ ఏర్పాటుకు అయ్యే మిగతా సొమ్మును బ్యాంకు ద్వారా రుణం ఇప్పిస్తుంది. జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులతో పాటు ఈ బాధ్యతను స్వయంసహాయక సంఘాల ఆర్పీలకు అప్పజెప్పారు. ఆర్పీలు వారి పరిధిలోని డ్వాక్రా మహిళలకు చెప్పి సోలార్ విద్యుత్ వల్ల కరెంటు బిల్లు ఆదా గురించి వివరించి అవగాహన కల్పించాల్సి ఉంది. సొంత ఇల్లు ఉన్న వారికి అయితే సోలార్ ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రైవేటు కంపెనీల కోసం ఆర్పీలకు టార్గెట్లు

సోలార్ ప్యానల్‌పై డ్వాక్రా ఆర్పీలు వారి పరిధిలో అవగాహన మాత్రమే కల్పించాల్సి ఉంది. అయితే కడపలో మాత్రం అందుకు విరుద్ధంగా ఆంధ్ర ఎంటర్‌ప్రైజెస్ సోలార్ కోసం మెప్మా అధికారులు ఊడిగం చేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఆ కంపెనీ ప్రతినిధులతో కుమ్మక్కై ఆర్పీలకు టార్గెట్ ఇవ్వడం దుమారం రేపుతోంది. కంపెనీ ప్రతినిధులతో పాటు ఆర్పీలను సమావేశంలో కూర్చోబెట్టి ఒక్కో ఆర్పీకి వంద కనెక్షన్లు చేయాలని టార్గెట్ ఇస్తున్నారు. లేదంటే సెలవుపై వెళ్లాలని బెదిరిస్తున్నారు. ప్రైవేటు కంపెనీ కోసం మెప్మాలోని ఓ అధికారి ఇలా వన్‌సైడ్‌గా వ్యవహరిస్తూ ఆర్పీలను వేధించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కడపలో 202 మంది ఆర్పీలున్నారు. ఒక్కొక్కరికి వంద చొప్పున అంటే 20వేల కనెక్షన్లు చేయాలని టార్గెట్ ఇచ్చి మరీ బెదిరించడం విమర్శలకు తావిస్తోంది. మీరు టార్గెట్‌లు పూర్తిచేస్తే కమీషన్ ఇస్తామని ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు చెబుతున్నారు. టార్గెట్ పూర్తి చేయాలని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆర్పీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

"ఎవరైనా సొంతిల్లు ఉండి సౌకర్యం బట్టి సోలార్ కనెక్షన్ తీసుకుంటారు. అలా కాకుండా మీ పరిధిలోని సభ్యులతో మాట్లాడి టార్గెట్ పూర్తిచేయండి అంటే ఎలా..? సొంతిల్లు ఉండాలి.. వారు అంగీకరించాలి కదా.. స్టేట్‌లో ఎక్కడా లేకున్నా ఇక్కడ మాత్రం అధికారులు ప్రైవేటు వారికోసం మాకు టార్గెట్ ఇస్తున్నారు" అని ఆర్పీలు వాపోతున్నారు.

ఈ విషయమై మెప్మా పీడీ కిరణ్‌కుమార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. తాము ఎలాంటి టార్గెట్‌లు ఇవ్వలేదని, కమీషన్ ఇస్తామని చెప్పలేదని అన్నారు. అవగాహన కల్పించాలని చెప్పామన్నారు. అయినా మీకు ఇవన్నీ ఎవరు చెప్పారంటూ ఎదురు ప్రశ్నించారు.

మేయర్ అవినీతితో కార్పొరేషన్ సర్వనాశనం

- ఎమ్మెల్యే, మేయర్ ఒకే పార్టీవారైతే నగరాభివృద్ధి సాధ్యం
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగర మేయర్‌గా తొమ్మిది సంవత్సరాలు పదవిలో ఉన్న వ్యక్తి అవినీతికి పాల్పడి కార్పొరేషన్‌ను సర్వనాశనం చేశారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే, మేయర్ ఒకే పార్టీకి చెందిన వారైతే కడపనగరం అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. బుధవారం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని తాము చెబుతూనే ఉన్నామన్నారు. అనేకసార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామన్నారు. విచారణల తర్వాత నోటీసులు ఇచ్చి చివరికి మేయర్ తొలగింపునకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ప్రస్తుత వైసీపీ కౌన్సిల్ పనితీరుతో నగరాభివృద్ధి నిలిచిపోయిందని, స్థానిక ఎమ్మెల్యే మాత్రం సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కడప ప్రజలు తెలుగుదేశం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కాగా.. సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి చేసిన ఆరోపణలపై విలేకరుల ప్రశ్నించగా శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ "సీనియర్లు లేరు, తోలు తొక్క లేదు. ఒకటే నాయకత్వం. ఇక్కడ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి కుటుంబం మాత్రమే నాయకత్వం. ఇది తెలుగుదేశం పార్టీ అంతే" అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సూర్యనారాయణరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

అరుదైన తాళపత్రాలు లభ్యం

కడప కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంత వరకు తెలుగు సాహిత్యలోకంలో ప్రచురించని అరుదైన తాళపత్ర గ్రంథాలు కడప నగరంలో లభించాయి. మృత్యుంజయకుంట శివాలయం పక్కనే నివాసం ఉంటున్న జిల్లాపరిషత్ విశ్రాంత ఉద్యోగి పెండ్లిమర్రి మల్లయ్య ఇంటిలో ఇవి వారి పూర్వీకుల నుంచి ఉన్నాయి. ఈ మేరకు ఆయన సమాచారం ఇవ్వడంతో వైవీయూ పాలక మండలి సభ్యుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి, జిల్లాచయితల సంఘం కార్యవర్గసభ్యులు వెల్లాల వెంకటేశ్వరచారి అక్కడికి వెళ్లి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ తాళపత్ర గ్రంథాలు పూర్తిగా ఆధ్యాత్మిక మైనవన్నారు. వీటిని ఎవరు రాశారో, ఎప్పుడు రాశారో తెలియదని ఆయా కవుల పేర్లు ప్రస్తావించలేదని అన్నారు. ఈ నాలుగు తాళ పత్రాల్లో మోక్షం, పరమార్థం, పరమపదం, పురుషార్థం, జ్ఞానం, యోగం, సమాధి, తపస్సు, తత్వవేత్త, సాంఖ్యం, ధ్యానం, ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం, నిధిద్యాసం, ఉపశమనం, ఆచమనం, విభూది తీర్థం, రుద్రాక్ష, నారికేళం, ధారాపాత్ర, అఖండలం, ఘంటానాదాలతో పాటు స్థూల సూక్ష్మశరీరాలు తదితర అంశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మల్లయ్యను అభినందించారు

అమరావతికి డీఎస్సీ అభ్యర్థులు


బారులు తీరిన బస్సులు


బస్సులను ప్రారంభిస్తున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, డీఈవో షంషుద్దీన్, సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి నిత్యానందరాజు తదితరులు

- 43 బస్సులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025కు ఎంపికైన అభ్యర్థులు అమరావతికి ప్రయాణమయ్యారు. 43 బస్సుల్లో 1,666మంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులు బయలుదేరారు. బుధవారం కడప నగరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపికైన 869 మందిలో 820 మంది అభ్యర్థులు వారి కుటుంబ సభ్యులతో కలిపి మొత్తం 1,666 మంది, 122 మంది సిబ్బంది, 15 మంది పోలీసుల భద్రతతో అమరావతికి బయలుదేరారు. ఈ బస్సులను డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి సెక్రటేరియట్ ప్రాంగణంలో గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తారని చెప్పారు. ఎంపికైన 869 మందిలో 637 మంది స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు కాగా మిగతా వారు టీజీటీలు, పీఈటీలని చెప్పారు. ఎంపిక ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించిన డీఎస్సీ చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, వైస్ చైర్మన్ జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌లకు జిల్లా విద్యాశాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


బస్సుల్లో బాయ్ బాయ్ చెబుతున్న డీఎస్సీ అభ్యర్థులు

క్వారీ వద్ద వీరంగం

- హిటాచీ, టిప్పర్ డ్రైవర్లపై పిడిగుద్దులు


గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో ధ్వంసమైన హిటాచి అద్దాలు

కడప క్రైం సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులోని నానాపల్లి గ్రావెల్ క్వారీ వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు వీరంగం సృష్టించారు. గ్రావెల్ తవ్వుతున్న హిటాచీ, లోడింగ్ కోసం వచ్చిన టిప్పర్ డ్రైవర్లపై పిడిగుద్దులు కురిపించారు. వివరాలిలా..

నానాపల్లెలోని కొండలో గ్రావెల్ తవ్వకాలు చాలా కాలంగా జరుగుతున్నాయి. ఇక్కడ అనుమతులు పొందిన వ్యక్తి నుంచి సబ్ లీజుకు తీసుకున్న మరో వ్యక్తి తవ్వకాలు చేస్తున్నారు. వీరంతా అధికార పార్టీ నేతలే. అయితే ఇటీవల ఇతడిని గ్రావెల్ తవ్వరాదని కడప నగరానికి చెందిన అధికార పార్టీ నేతలు ఆదేశించారని తెలిసింది. దీంతో ఇటీవల కడప టీడీపీ నేతలపై పలువురు సీనియర్లు నిరసన స్వరం వినిపించారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం కార్లు, బైకుల్లో వెళ్లిన పలువురు క్వారీ వద్ద ఉన్న హిటాచీ, టిప్పర్ డ్రైవర్లపై దాడి చేశారు. వాహనాల అద్దాలను పగులకొట్టారు. భయాందోళనకు గురైన బాధితులు చిన్నచౌక్ పోలీసులకు సమాచారం అందచేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే నిందితులు పరారయ్యారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై చిన్నచౌక్ సీఐ ఓబులేశును ఫోన్‌లో వివరణ కోరేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రాజరాజేశ్వరరెడ్డి అన్నారు.


దాడిలో ధ్వంసమైన టిప్పర్ అద్దాలు

7 టిప్పర్లు సీజ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కడప మండల పరిధిలో వైఎస్సార్ లేఅవుట్ సమీపంలోని నానాపల్లెలో అనుమతులు లేకుండా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న 7 టిప్పర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కడప తహశీల్దారు నారాయణరెడ్డికి అందిన ముందస్తు సమాచారం మేరకు మంగళవారం రాత్రి ఆర్‌ఐ ఈశ్వర్‌కుమార్, వీఆర్వోలు శ్రీనివాసులు, అనిల్, రవికుమార్‌తో పాటు వీఆర్‌ఏలతో నిఘా పెట్టారు.

ఈ మేరకు వారు 7 వాహనాలను సీజ్ చేసి తహశీల్దారు కార్యాలయంలో పెట్టారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ అక్రమంగా గ్రావెల్ తరలించే వారిపై జరిమానా విధించేందుకు మైన్స్ అధికారులకు లెటర్ పెట్టామన్నారు. కాగా.. వాహనాలను స్వాధీనం చేసుకునే సమయంలో రెవెన్యూ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారంటూ తహశీల్దార్ ఫిర్యాదు మేరకు చిన్నచౌక్ పోలీసులు 10 మందిపై కేసు నమోదు చేశారు.

'విగ్రహాలకోసం ప్రజాధనం దుర్వినియోగం'

పులివెందుల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనధికారికంగా విగ్రహాల ఏర్పాటుకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, వీరిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ.. పులివెందుల, కడపలలో అనధికార విగ్రహాల ఏర్పాటుకు కోట్లాది రూపాయలు ఖర్చుచేశారన్నారు. పులివెందులలో 8 కూడళ్లలో అనధికారికంగా ఏర్పాటుచేసిన విగ్రహాలనే మూడుసార్లు తొలగించడం, మళ్లీ చేశారన్నారు. వీరిపైన ఎలాంటి చర్యలు తీసుకుంటారో మంత్రి స్పష్టంగా చెప్పాలన్నారు. దీనిపై రోడ్లు భవనాల శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డి సమాధానమిస్తూ పులివెందుల సుందరీకరణలో భాగంగా రూ.3.50 కోట్లు, కడప సుందరీకరణలో భాగంగా రూ.7.50కోట్లు ఖర్చుచేశారన్నారు. దీనిపై సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఆకాంక్ష జిల్లాల సాధనకు కృషిచేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి లక్ష్య సాధనకు కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఆకాంక్ష జిల్లా, బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన ఆకాంక్ష జిల్లా, బ్లాకుల్లో వైఎస్సార్ కడప జిల్లాలో సామాజిక స్థాయిని ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకు రావడంలో పురోగమనంలో ఉన్నామన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది సమన్వయంతో జిల్లా నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. అలాగే ఆకాంక్ష బ్లాకుల లక్ష్య సాధనలో భాగంగా సీకేదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, సీడీఎస్ పీడీ రమాదేవి, స్మార్ట్ కిచెన్ నోడల్ అధికారి జోయల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారదా నమోస్తుతే


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో శారదాదేవిగా అమ్మవారు


ప్రొద్దుటూరులో ఆకట్టుకున్న బొమ్మల కొలువు

కడప కల్చరల్ / ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అయిన బుధవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శారదాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మి అలంకారంలో, వెంకటేశ్వర్లుపేటలోని చౌడేశ్వరీదేవి ఆలయంలో, శివాలయంలో భవానీదేవిగా కరుణించారు. కడప నగరంలోని అమ్మవారిశాలవీధిలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు చంద్రఘంటదేవిగా భక్తులను కరుణించారు. రాజంపేట రోడ్డులో ఉన్న లలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో, రాజారెడ్డివీధిలోని గంగమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.


కడప అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారం


గాయత్రీదేవిగా లలితా అమ్మవారు


చంద్రఘంటాదేవి అలంకారంలో విజయదుర్గాదేవి


భద్రావతి భావనారుషి ఆలయంలో వినాయకీదేవి అలంకారం

ఆవుల రాబడి పెంపు

ఆవుల పెంపకంతో ఆదాయం ● పల్లెల్లో పొంగుతున్న పాలధార



రైల్వేకోడూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఆవుల పెంపకం బాగా పెరుగుతోంది. ఆవుపాలు శ్రేష్ఠంగా భావించడంతో వీటికి రోజు రోజుకు డిమాండ్ పెరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల పాడి రైతులు రకరకాల ఆవులను తీసుకుని వచ్చి పెంచుతున్నారు. తద్వారా వచ్చే పాలను పాలకేంద్రాలకు తరలించి ఆదాయం పొందుతున్నారు.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్యాన పంటలపై ఆధారపడి ఉన్నారు. తరచూ నష్టాలు రావడం, చీడపీడలు ఎక్కువ కావడం, ప్రకృతి వైపరీత్యాలు తదితర కారణాలతో ఉద్యాన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఉద్యాన రైతులు చాలామంది పాడి రైతులుగా మారుతున్నారు. ఉన్న పొలంలోనే షెడ్లు వేసుకుని ఆవులను పెంచుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఆవులు, గేదెల పెంపకాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆవులు, గేదెల పాలు సేకరించి కొందరు తిరుపతి, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లోని పాల కేంద్రాలకు తరలిస్తున్నారు. ఒక్క లీటరు ఆవు పాలు రూ.25 నుంచి రూ.30కి అమ్ముతున్నారు. గేదె పాలను మాత్రం స్థానికంగానే అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు పాలను పాడి రైతుల నుంచి సేకరించుకుని రైల్వేకోడూరు పట్టణంలో అమ్ముతున్నారు. ఒక్క ఆవుకు రోజు సగటున గడ్డి, పోషకాలు రూ.100 ఖర్చు వస్తోందని పాడి రైతులు చెబుతున్నారు.

ఒంగోలు, పుంగనూరు, నాటు, గిర్, జల్లికట్టు, జెర్సీ, తార్‌పాల్, శాషివాల రకం ఆవులతో పాటు, నాటు ఎనుములు, షాడో, కాంక్రేజ్ తదితర రకాల గేదెలను ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకుని పాడిని జీవనాధారంగా చేసుకుంటున్నారు. పశు సంవర్ధక శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. రైల్వేకోడూరు మండలంలోని పొట్టిరాజుగారిపల్లెలో పద్మ అనే మహిళ సుమారు 100కు పైగా వివిధ రకాల ఆవులు, గేదెల పెంపకం చేపట్టారు. రోజుకు దాదాపు 150లీటర్ల పాలు అమ్ముతున్నారు.

గోరక్షణతో సంతృప్తి



ఆదాయం కంటే గోరక్షణతో ఆత్మ సంతృప్తి ఉంటుంది. గేదెలు, జెర్సీ ఆవులు, నాటు ఆవులు 100కు పైగా ఉన్నాయి. వాటి సంరక్షణకు 30 మంది కూలీలను పెట్టుకున్నాం. గోవులను పెంచడం ద్వారా మా కుటుంబానికి మంచి జరుగుతోంది.

- పద్మ, మహిళా పాడి రైతు, పొట్టిరాజుగారిపల్లె





రోజుకు 58,600 లీటర్ల పాలు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో చుక్క ఎనుములు, నాటు ఆవులు కలిపి 25,544 ఉన్నాయి. క్రాస్‌బ్రీడ్ ఆవులు, దేశీయ ఆవులు కలిపి 19,215 ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో సుమారు 6 వేల మంది పాడి రైతులు ఉన్నారు. ప్రతి రోజు ఆవులు, గేదెలు కలిపి 58,600 లీటర్ల పాల ఉత్పత్తి ఉంది. ఇందులో ఇంటి అవసరాలకు 11,000 వేల లీటర్లు, ప్రైవేటు డెయిరీలకు 23,000 లీటర్ల పాలను సరఫరా చేస్తున్నారు. మిగిలిన పాలను స్థానికంగానే అమ్ముతున్నారు.

పాలిచ్చే వాటిని ఎంపిక చేసుకోవాలి

ప్రస్తుతం పాడి రైతులు చుక్క ఎనుములు, నాటు ఆవులు, క్రాస్‌బీడ్ ఆవులు, దేశీయ జాతులకు చెందిన ఆవుల పెంపకాన్ని మొదలు పెట్టారు. పాలిచ్చే పశువులను పాడి రైతులు ఎంపిక చేసుకోవాలి. పాల దిగుబడి పెంచుకుంటే పాడి రైతులకు ఆదాయం ఉంటుంది.

- ప్రతాప్, రైల్వేకోడూరు మండల పశువైద్యాధికారి

వజ్రాల వంకపై పైపుల ఏర్పాటు



వజ్రాల వంకపై పైపులు వేస్తున్న దృశ్యం

పీలేరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం ఎంపీ పల్లె పంచాయతీ చెరువుకిందపల్లె వద్ద ఉన్న వజ్రాల వంకపై సిమెంటు పైపుల ఏర్పాటు ప్రక్రియను అధికారులు చేపట్టారు. చెరువుకిందపల్లెకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, ఉన్న మట్టి రోడ్డు కూడా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయిన వైనాన్ని ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'దారిద్ర్యం' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. చెరువుకిందపల్లె దుస్థితిపై మండల స్థాయి అధికారులు స్పందించారు. రాయచోటి నుంచి సిమెంటు పైపులను తెప్పించి తెగిపోయిన వజ్రాల వంక కాజ్‌వేపై ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు గురువారం సాయంత్రానికి కొలిక్కి వచ్చి తమకు దారి సౌకర్యం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

యూరియా కోసం ఎగబడ్డ రైతులు



బి.కొత్తకోటలో యూరియా కోసం క్యూలో రైతులు

బి.కొత్తకోట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోటలోని గ్రోమోర్ కేంద్రంలో యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఉండటంతో వరి, మొక్కజొన్న సాగుచేసిన రైతులు యూరియా కోసం వేచి చూస్తున్నారు. బుధవారం బి.కొత్తకోటలోని గ్రోమోర్‌కు 13 టన్నులు, మండలంలోని గోళ్లపల్లెలో వున్న పుడమి ఫర్టిలైజర్స్‌కు 13 టన్నుల యూరియా దిగుమతి అయింది. విషయం తెలుసుకున్న రైతులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకుని తోపులాటకు దిగారు. దీంతో వ్యవసాయాధికారి చంద్రశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి, సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను అదుపు చేశారు. పోలీసుల పహారా మధ్య జరిగిన పంపిణీలో 290 బస్తాలు కేవలం గంటలో అమ్ముడుపోయాయి. ముందుగా వచ్చిన రైతులకు దొరకగా మిగిలిన రైతులు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. యూరియా కోసం అష్టకష్టాలు పడుతున్నామని స్థానికంగా కొందరు అక్రమ నిల్వలు ఉంచుకుని అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు వాపోయారు. ఈ విషయమై ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ యూరియా దొరకదేమోనన్న ఆతృతతో ప్రస్తుతం అవసరం లేకున్నా ముందస్తు కొనుగోలుకు రైతులు వస్తుండడంతో ఇబ్బందిగా ఉందన్నారు. యూరియాను అందరికీ అందుబాటులోకి తెస్తామన్నారు.

బైక్ గుంతలో పడి ఇరువురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన గుంత, గాయపడిన రమణయ్య, నరసింహులు

గాలివీడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉన్న గోతిలో స్కూటీ పడడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమానుకు చెందిన రమణయ్య, నరసింహులు శుభలేఖలు పంచేందుకు బైక్‌పై గాలివీడుకు వచ్చారు. అక్కడి నుంచి రాయచోటికి వెళుతుండగా ఒడిసెలవంకపల్లెకు సమీపంలోని గాలివీడు- రాయచోటి రహదారి మధ్యలో ఉన్న గుంతలో స్కూటీ పడడంతో రమణయ్య, నరసింహులు ఎగిరి రోడ్డుపైన పడ్డారు. నరసింహులుకు హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడగా వెనుకవైపు కూర్చున్న రమణయ్య తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 వాహనంలో ఇరువురిని రాయచోటి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

ఆలస్యంగా నడిచిన ఏడుకొండలు రైలు



ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే ఏడు కొండలు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం తీవ్ర ఆలస్యంగా నడిచింది. ఐదన్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులకు చుక్కలు కన్పించాయి. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్‌లోనే ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలు ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 8.14 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లెరోడ్‌కు తెల్లవారుజాము 3.18 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 8.39 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.09 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 9.23 గంటలకు వెళ్లింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్ళాల్సిన రైలు ఉదయం 10.53 గంటలకు చేరింది. రైలు తీవ్ర ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. రైలులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో గంటల తరబడి వేచిచూడాల్సి వచ్చింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ములకలచెరువు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారిణి తాగి ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... కడప జిల్లా పులివెందులకు చెందిన చిన్నప్ప (32) రెండు వివాహాలు చేసుకున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మండలంలోని పెద్దపాళ్యంలో నివాసమున్న మొదటి భార్య దగ్గరకు వచ్చాడు. భార్యాభర్తలు ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన చిన్నప్ప క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తులు 108లో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

27 మంది జూదరుల అరెస్ట్

రామాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల పంచాయతీ చింతలవాండ్లపల్లె పరిధిలో బుధవారం ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.27,500 నగదు, 3 బైకులు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా ఇటువంటి కార్యకలాపాలను గమనిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని తెలియజేశారు.

రెడ్డెమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణం స్వీకారం చేస్తున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులు

గుర్రంకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ ఆలయ చైర్మన్‌గా లంకిపల్లె రాజన్ననాయుడు బుధవారం ప్రమాణం చేశారు. ఆలయ పాలకవర్గ సభ్యుల చేత దేవదాయశాఖ అధికారి శశికుమార్ ప్రమాణం చేయించారు. ఆలయ చైర్మన్‌గా రాజన్ననాయుడు, పాలకవర్గ సభ్యులుగా గాయత్రి, ఆశాజ్యోతి, అంజికుమార్, శ్రీనివాసులనాయుడు, కిరణ్, యశోదమ్మ, పుణ్యవతి, ప్రభాకర్, గోవిందమ్మ, ప్రకాశ్ చేత ప్రమాణం చేయించారు. చైర్మన్ రాజన్ననాయుడు మాట్లాడుతూ రెడ్డెమ్మ అమ్మవారి ఆలయం అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. అమ్మవారి కీర్తిని విస్తరింపజేయడానికి అన్నివిధాలా పనిచేస్తామన్నారు. ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని వసతులను కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో మంజుల, నేతలు జగదీష్‌కుమార్, రెడ్డిప్రసాద్‌నాయుడు, దద్దాల హరిప్రసాద్ నాయుడు, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, టి.కృష్ణమ నాయుడు, బాబాజాన్, ప్రదీప్, జయసూరి, నాగేంద్ర, మహాత్మారెడ్డి, ఆనంద్, రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన లక్ష్మయ్య

లక్కిరెడ్డిపల్లె/సీకే దిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని దప్పేపల్లి పంచాయతీ డి.రామాపురానికి చెందిన ఈశ్వరయ్య, కొప్పుల లక్ష్మయ్య కడప నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా ఘాట్‌లోని 5వ మలుపు వద్ద వేగంగా వస్తున్న లారీలో నుంచి డ్రైవర్ కిందకు దూకడాన్ని గమనించి బైకును పక్కన పడేసి పరుగెడుతుండగా లారీ వారిపైకి దూసుకెళ్లింది. కొప్పుల లక్ష్మయ్య (65) అక్కడికక్కడే మృతి చెందగా ఈశ్వరయ్య గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. చింతకొమ్మదిన్నె పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు లక్ష్మయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మరణంతో దప్పేపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన చింతకొమ్మదిన్నె సీఐ బాలమద్దిలేటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలం విషయంలో వృద్ధ దంపతులపై దాడి

● అవమానంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రెడ్డెప్ప

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు కోలా రెడ్డెప్ప (82) ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారిణి తాగి ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. తాలుకా పోలీసులు కథనం మేరకు మదనపల్లె మండలం కొత్తవారిపల్లె గ్రామం ఎనుములవారిపల్లె వాసి కోలా రెడ్డెప్ప, అతడి భార్యపై అదే గ్రామానికి చెందిన వేణు, అతడి భార్య కాంతమ్మ, ఉదయ్ అతడి భార్య రేణుక, జగదీష్ (నాని), దాడి చేసి గాయపర్చారు. 2023లో తన కుమారుడు సోముశేఖర్ పేరిట గుర్రప్ప వద్ద 63 సెంట్లు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు. అదే గ్రామానికి చెందిన వేణు వర్గీయులు ఆ భూమిని తమకు అమ్మాలని అడిగారు. ఇవ్వమని తెలపడంతో బుధవారం పొలం పనులు చేస్తున్న వృద్ధులపై దాడి చేశారు. తాము కొనుగోలు చేసిన పొలంలోకి దౌర్జన్యంగా జొరబడి దాడి చేశారని బాధితుడు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ దంపతులపై చేసిన దాడిని అవమానంగా భావించిన వృద్ధుడు ఇంటి వద్దకు వచ్చి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

9 మంది తమిళ స్మగ్లర్లు అరెస్ట్

● 12 దుంగలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



పట్టుబడ్డ స్మగ్లర్లు, దుంగలతో ఎస్పీ ధీరజ్, పోలీసు సిబ్బంది

రాయచోటిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా పరిధిలోని టి.సుండుపల్లె మండలం మాచిరెడ్డిగారిపల్లె అటవీ ప్రాంతంలో అక్రమంగా ఎర్రచందనం తరలిస్తున్న 9 మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.34.40 లక్షల విలువ చేసే 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ ధీరజ్ కునుబల్లి ఎర్రచందనం స్మగర్ల అరెస్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, ఆర్ఎస్‌టీఎఫ్ సీఐ మధు, కలికిరి సీఐ అనిల్‌తో పాటు టి.సుండుపల్లె పోలీసులు, ఆర్ఎస్‌టీఎఫ్ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సుండుపల్లె మండల పరిధిలోని మాచిరెడ్డిగారిపల్లెకు సమీపంలోని తొగురుపల్లి క్రాస్‌కు సమీపంలోని తొగురుపల్లి క్రాస్ వద్ద ఎర్రచందనం దొంగల కోసం కాపు కాపు కాశారని ఎస్పీ తెలియజేశారు.

ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో మాచిరెడ్డిగారిపల్లె వైపు నుంచి ఒక కారు రాగా స్మగ్లర్లు మామిడి తోట నుంచి ఎర్రచందనం దుంగలను కారులో లోడ్ చేయడానికి ప్రయత్నించారన్నారు. అప్పటికే నిఘాలో ఉన్న పోలీసు బృందాలు వారిని అడ్డుకోవడానికి ముందుకు వెళ్లగా కొంత మంది కారులో ఎక్కి పోలీసులను ఢీకొట్టే ప్రయత్నం చేసి తప్పించుకున్నారన్నారు. అయితే పోలీసులు వారిని వెంబడించి తమిళనాడు రాష్ట్రానికి చెందిన బాకియారాజ్, రజిత్‌కుమార్‌గోవిందన్, స్వామినాధన్, సురేశ్ కుమార్ శివకుమాదర్, దురై స్వామి, రాజామణి, పరశాంతు చంద్రన్, రాజా విజయ్‌కుమార్, తిరుమలై చిన్నయాన్ అనే 9 మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు వెంటాడి పట్టుకున్నారన్నారు. వారి వద్ద నుంచి 34.40 లక్షల విలువ గల 344 కిలోల బరువు గల 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టనున్నట్లు ఎస్పీ వివరించారు. పారిపోయిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు.

తలకోన వద్ద 10 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుబడిన స్మగ్లరు, వాహనం, దుంగలు

పీలేరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న తమిళనాడుకు చెందిన స్మగ్లరుతో సహా ఒక వాహనం, 10 ఎర్రచందనం దుంగలను పట్టుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు... తలకోన అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఉదయం తిరుపతి జిల్లా యల్లమంద, చిత్తూరు జిల్లా పులిచెర్ల, మంగళంపేట రోడ్డు మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో పులిచెర్ల మార్గంలో వేగంగా వస్తున్న ఒక ఫోర్డు ఎకోస్పోర్టు(ఏపీ03 బీజే 1555) వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 10 ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆ వాహనంతో సహా అందులో ఉన్న తమిళనాడు రాష్ట్రం, సేలం జిల్లా తెక్కంపట్టి గ్రామానికి చెందిన ఇళయరాజాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దాడిలో ఎఫ్ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్ఎస్‌వో ప్రకాశ్ కుమార్, ఎఫ్‌బీవోలు ప్రతాప్, రెడ్డిప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల కోసం దేశవ్యాప్త ఉద్యమం

● బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు



మాట్లాడుతున్న దుర్గం సుబ్బారావు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల సాధనకోసం దేశవ్యాప్తంగా ఉద్యమం చేపట్టనున్నట్లు బాస్ నేషనల్ కో-ఆర్డినేటర్ దుర్గం సుబ్బారావు ప్రకటించారు. పూనా ఒప్పంద దుర్దినం సెప్టెంబరు 24వ తేదీని పురస్కరించుకుని బుధవారం పట్టణంలో బాస్, వీసీకే పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో 'రాజ్యాంగం-రాజకీయ హక్కులు-ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేటు రంగంలో ప్రాతినిధ్య రిజర్వేషన్లను గురించి సమగ్రంగా వివరించారు. వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాడి సాధించిన ప్రత్యేక నియోజకవర్గాలను పూనా ఒప్పందంలో కోల్పోయామన్నారు. ప్రముఖమైన, ప్రధానమైన వివిధ రంగాలను ప్రైవేటుపరం చేయడంతో 85 శాతం విద్య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ప్రైవేటు రంగంలోకి వెళ్లిపోయాయని, ప్రభుత్వం వద్ద ఉన్న 15 శాతం కూడా ఆ వర్గాలకు దక్కలేదని వివరించారు. ఆ అవకాశాలు పూర్తిస్థాయిలో అర్హులకు దక్కేలా దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామన్నారు. సమావేశంలో కె.వి.రమణ, పల్లం తాతయ్య, ముత్యాల మోహన్, పి.శ్రీనివాసులు, కడప రమణ, నంద్యాల శ్రీపతి, నీరుగట్టి రమణ, పీర్‌బాషా, వి.దొరస్వామి, ఓబులేసు, కర్ణాటక మునెప్ప, మునివెంకటప్పతో పాటు అన్నమయ్య, చిత్తూరు, కడప, తిరుపతి, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన వీసీకే, బాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మొటుకుపల్లె చెరువుకు గండి

● మరమ్మతులు చేసిన స్థానికులు



చెరువు కట్టకు మరమ్మతు పనులు చేస్తున్న రైతులు

మదనపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొటుకుపల్లె-ముడివారిపల్లె సమీపంలోని వాయలపాటువానిచెరువుకు గండి పడింది. కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాంతంలో ఇటీవల వర్షాలు ఎక్కువగా కురిశాయి. దీంతో పైప్రాం తం నుంచి వచ్చిన వర్షపునీటితో చెరువునిండి మొరవపోయింది. అయితే అప్పటికే చెరువుకట్ట బలహీనంగా ఉండడంతో వర్షపు నీరు చేరడంతో లీకేజీ ప్రారంభమైంది. రైతు లు దీనిని మొదట్లో సాధారణ లీకేజీగా పరిగణించారు. అయితే పైప్రాంతంలోని కొండలు, గుట్టల నుంచి నీరు యధావిధిగా రావడంతో లీకేజీ అంతకంతకూ పెరుగుతూ గండి పడింది. దీనిని గమనించిన స్థానిక రైతులు ఈ విషయాన్ని మొటుకుపల్లె టీడీపీ నేత, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి మొటుకుపల్లె శివ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన సొంత నిధులు వెచ్చించి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. ఇందులో భాగంగా ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌తో మట్టిని తరలించి స్థానిక రైతుల సహకారంతో గండిని పూ డ్చి నీటి లీకేజీని ఆపేశారు. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఇందులో మొటుకు శి వ, శంకర్, అంజనప్ప, సోమశేఖర్, వెంకటరణ, బద్దుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. భవిష్య త్తు వర్షాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పసుపులో అంతరపంటగా బొప్పాయి

● డ్రిప్‌తో కళకళలాడుతున్న తోటలు

పసుపులో అంతరపంటగా సాగు చేసిన బొప్పాయి





దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పసుపు సాగులో రైతులు కొత్తపద్ధతులు అవలంభిస్తున్నారు. పసుపుతో పాటు అంతర పంటగా బొప్పాయి సాగు చేపడుతు న్నారు. డ్రిప్ ఏర్పాటు చేసి నీటి తడులు అందించ డంతో తోటలు ఏపుగా పెరిగి కళకళలాడుతున్నాయి. మైదుకూరు ప్రాంతం పసుపు సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ పండిన పసుపు పంట నాణ్యత పరంగా వ్యాపారులను ఆకర్షిస్తోంది. దువ్వూరు, ఖాజీపేట, మైదుకూరు, చాపాడు మండలాల్లో విస్తృతంగా ఈ పంటను సాగుచేశారు. పంట సాగుకు ఖర్చులు పెరిగిన నేపథ్యంలో సైతం పంట వేసేందుకు రైతులు వెనుకాడటం లేదు. మార్కెట్‌లో వట్టి పసుపునకు డిమాండ్ ఉండడం, మంచి ధరలు పలకడంతో రైతులు ఈ సంవత్సరం కూడా పసుపు సాగుకు ఎక్కువ ఆసక్తి కనపరిచారు. దువ్వూరు మండలంలో కిందటి సంవత్సరం 582 ఎకరాల్లో సాగైనట్లు అధికారుల లెక్కలు తెలుపుతున్నాయి. ఈ సంవత్సరం అదనంగా మరో వంద ఎకరాల్లో విస్తీర్ణం పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఇక ఈ ఏడాది రైతులు పసుపులో అంతర పంటగా బొప్పాయిని సాగు చేశారు. తద్వారా తెగుళ్ల నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని చెబుతున్నారు. ఇక పసుపు పంటలో డ్రిప్ విధానం అవలంబించేందుకు రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. తద్వారా తోటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వచ్చేందుకు తోడ్పడుతుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రస్తుతం డ్రిప్ ఏర్పాటు చేసిన తోటలు కళకళలాడుతున్నాయి.

డ్రిప్‌తో బహుళ ప్రయోజనాలు

పసుపు సాగులో డ్రిప్ ఏర్పాటు చేయడం వలన ప్రయోజనాలు మెండుగా ఉన్నాయి. నేరుగా మొక్కకు నీరు అందుతుంది. నీటి వృథాను అరికట్టవచ్చు. ఎరువులను మొక్కకు అందేటట్లు చేయవచ్చు. కలుపు తగ్గుతుంది. ఖర్చులు ఆదా అవుతాయి. దిగుబడి పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది.

- రామకృష్ణ, ఉద్యానవన శాఖ అధికారి, మైదుకూరు

పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి



గుడిపాడులో రైతులతో మాట్లాడుతున్న జేడీఏ చంద్రానాయక్

దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడుకోవడం వలన రైతులకు ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. గుడిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి జొన్నపంటలను పరిశీలించారు. ఎరువులను మోతాదుకు మించి వాడవద్దని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులవాడక విధానం అవలంభించాలని తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారి అమర్‌నాథ్‌రెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ పోరెడ్డి వెంకటరమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా వెంకట సుధాకర్‌రెడ్డి ప్రమాణస్వీకారం



మాట్లాడుతున్న వెంకటసుధాకర్‌రెడ్డి

చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గవర్నర్‌పేటలోని రైతు శిక్షణ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల సంస్థ డైరెక్టర్‌గా పల్లవోలు వెంకటసుధాకర్‌రెడ్డి బుధవారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. ఏపీఎస్ఐడీసీ ఎండీ తిరుమలరావు ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వెంకటసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, రాష్ట్రమంత్రి నారా లోకేశ్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వేలూరు ఎంపీ పుట్టా మహేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యుల సహకారంతో రైతుల కోసం కొత్త స్కీంలను ఏర్పాటు చేస్తామన్నారు. దెబ్బతిన్న స్కీంలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఐడీసీ బోర్డు చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ తదితరులు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు.

బోధనలో కృత్రిమ మేథ వినియోగం అవసరం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేథ (ఏఐ)ను బోధన, పరిశోధనలో వినియోగిస్తే విద్యార్థుల్లో ఆవిష్కరణల పట్ల ఆసక్తి పెరుగుతుందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పీఎం ఉష విభాగం ఆధ్వర్యంలో క్రియాశీల బోధన కోసం ఏఐ సాధనాలు అనే అంశంపై జాతీయస్థాయి ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టెక్నాలజీ విద్యార్థులు, అధ్యాపకుల జ్ఞానాన్ని విస్తరించడంలో తోడ్పడుతుందని తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ఎస్వీయూ ప్రొఫెసర్ డాక్టర్ జీవీ రమేష్‌బాబు ఏఐ ప్రాధాన్యతను వివరించారు. పీఎం ఉష ప్రాజెక్టు కింద యూనివర్సిటీకి రూ.20కోట్లు మంజూరైనట్లు సమన్వయకర్త డాక్టర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్.సునీత, డాక్టర్ కె.లలిత, డాక్టర్ పి.సరితలు సమన్వయం చేశారు.

అక్టోబరు 31 వరకు గడువు పొడిగింపు

సీకేదిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో కాలేజీ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువును అక్టోబరు 31 వరకు పొడిగించినట్లు కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ప్రవేశానికి ఎంసెట్ ర్యాంకుతో అవసరం లేదని, ఇంటర్ ఎంపీసీ లేదా బైపీసీ, రెండు సంవత్సరాలు పాలిటెక్నిక్ డిప్లమో హోంసైన్స్ కానీ, సీడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఇంటర్, పాలిటెక్నిక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు లభిస్తాయన్నారు. గుంటూరులో హాస్టల్ వసతితో కూడిన భోధన, శిక్షణ ఉంటుందని.. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

27న బ్యాడ్మింటన్ ఎంపికలు

కడప స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న శనివారం ఉదయం 9గంటలకు స్కూలు గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-19 బ్యాడ్మింటన్ (షటిల్) ఎంపికలు జరగనున్నట్లు జిల్లా సెక్రటరీ సీఎం రాజు తెలిపారు. జిల్లాలోని ఔత్సాహిక క్రీడాకారులు తమ బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ తప్పక వెంట తీసుకురావాలని కోరారు.

మహిళల హక్కుల కోసం.. ముప్పై ఏళ్లుగా పోరాటం

● కరువుకు బలి అవుతున్నది సీమ ఆడబిడ్డలే ● చైతన్య మహిళా సంఘం కన్వీనర్ జ్యోతక్క



చైతన్య మహిళా సంఘం ర్యాలీలో పాల్గొన్న రెండు తెలుగురాష్ట్రాల మహిళా నేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మహిళల హక్కుల కోసం మూడు దశాబ్దాలుగా ఎన్నో రాజ్య నిర్బంధాలను ఎదుర్కొంటూ అలుపెరుగక పోరాడుతున్న సంస్థ చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) అని ఆ సంఘం తెలుగు రాష్ట్రాల కన్వీనర్ జ్యోతక్క పేర్కొన్నారు. బుధవారం చైతన్య మహిళా సంఘం ఆవిర్భవించి మూడు వసంతాలు పూర్తయిన సందర్భంగా స్థానిక రామేశ్వరం రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో రాష్ట్ర మహిళా సదస్సు జరిగింది. ఈ సదస్సులో జ్యోతక్క మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అనేక మహిళా సంఘాలు సమాఖ్యగా ఏర్పడి చైతన్య మహిళా సంఘంగా 1995లో తిరుపతిలో ఆవిర్భవించిందన్నారు. దీనికి దూబగుంట మహిళల సారా ఉద్యమ స్ఫూర్తే కారణమన్నారు. వరకట్న హత్యలకు, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు సాగించి ఎందరో మహిళలకు అండగా నిలిచిందన్నారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలతో కలిసి పనిచేసిందన్నారు. సభకు అతిథిగా పాల్గొన్నా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాలు మహిళలను అణిచివేసే సాధనాలన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న వారిలో కూడా ఈ మూఢనమ్మకాలు అంధవిశ్వాసాలు వుంటున్నాయన్నారు. భారత దేశం ప్రపంచంతో పాటి ఎదగకపోవడానికి ఇవే ప్రధాన కారణమన్నారు. డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ గీత మాట్లాడుతూ భ్రూణహత్యల వల్ల స్త్రీ పురుషుల రేషియో తగ్గి వివాహాలు కాని పరిస్థితి ఏర్పడుతుందన్నారు.. ఎన్జీవో మహిళా చైర్‌పర్సన్ జయమ్మ మాట్లాడుతూ ఉద్యోగ రంగంలో మహిళలకు అన్యాయాలు జరుగుతున్నాయన్నారు. ఏపీ రాష్ట్రకన్వీనర్ రాధ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మద్యం దుకాణాలకు పర్మిట్ రూములిచ్చి, బార్లను అర్ధరాత్రి వరకు తెరిచి ప్రభుత్వాలు ఖజానాలు నింపుకుంటూ మహిళలకు సంక్షేమాన్ని అమలు చేస్తున్నామనడం ఎంతవరకు సమంజసమన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ సెక్స్ ట్రాఫికింగ్‌లకు హాట్‌స్పాట్‌లుగా రాయలసీమ కరువు ప్రాంతాలు వున్నాయన్నారు. ఏ పార్టీ అయినా సీమలో కరువు నిర్మూలన కోసం పాటుపడటం లేదన్నారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నేతల సందేశాలు మహిళల హక్కుల పోరాటంలో తమ సంఘీభావం ప్రకటించాయి. కార్యక్రమంలో సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, పౌరహక్కుల సంఘం జిల్లా కన్వీనర్ సురేష్‌బాబు, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు రషీద్, మహిళాశక్తి రాష్ట్ర కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, యువ న్యాయవాది హరిత, రాయలసీమ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ మహమూద్, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య మాదిగ, పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జమాతే ఇస్లాం మహిళా కన్వీనర్ రెహనా, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సభలో ప్రజాకళామండలి కళాకారుల పాటలు సభికులను ఉత్తేజపరిచాయి.




మాట్లాడుతున్న జ్యోతక్క

కారు ఢీకొని బాలిక మృతి



చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగురవలూరు గ్రామంలో బుధవారం మధ్యాహ్నం గొల్లపల్లె దక్షిణి (6) అనే బాలికను కారు ఢీకొనడంతో మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు... బి.మఠం మండలం నందిపల్లె గ్రామానికి చెందిన గొల్లపల్లి రాజు చిన్నగురవలూరులోని ఓ వివాహ కార్యక్రమానికి తన కూతురుతో కలిసి హాజరయ్యారు. పెళ్లి కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి వెళుతుండగా వాహనాలు నిలిపిన చోట ఒక కారు రివర్స్ తిప్పుతుండగా దాని వెనుక ఉన్న బాలిక ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. తలకు, ఇతర శరీర భాగాలకు బలమైన గాయాలయ్యాయి. 108 వాహనంలో చికిత్స కోసం ప్రొద్దుటూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సాయిపేట ఆటో స్టాండు ఏరియాకు చెందిన వివాహిత గురువారం తెల్లవారు జామున ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. సాయిపేటకు చెందిన పఠాన్ నసీంఖాన్ (42) ఆమె భర్త ఆరిఫుల్లాఖాన్ మధ్య గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయి. మూడేళ్ల క్రితం ఆరిఫుల్లాఖాన్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో నసీంఖాన్ ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

గాయపడ్డ టీడీపీ కార్యకర్త మృతి



నాగేంద్ర (ఫైల్)

కలసపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులతో కలిసి పెళ్లిచూపులకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ కార్యకర్త ఎల్లనూరు నాగేంద్ర (30) చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కలసపాడు మండలం లింగారెడ్డిపల్లె నుంచి గిద్దలూరుకు సోమవారం తల్లిదండ్రులతో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా సంజీవరాయునిపేట వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని బొలెరో వాహనం ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా నాగేంద్ర మృతి చెందాడు. తల్లిదండ్రులు అక్కడే చికిత్స పొందుతున్నారు. నాగేంద్ర మరణవార్త తెలిసిన రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా రహంతుల్లా, నీటి సంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, యువ నాయకుడు స్వామిరంగారెడ్డి, మాజీ సైనికుడు మస్తాన్, గ్రామస్థులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

భిన్నత్వంలో ఏకత్వమే యూఎస్‌వో లక్ష్యం

● రేపటి నుంచి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ ● యూఎస్‌వో సెక్రటరీ నీనా జైన్



సమావేశంలో మాట్లాడుతున్న నీనా జైన్

పులివెందుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భారత దేశంలోని వివిధ సంస్కృతులు, సాంప్రదాయలు కలిగిన విద్యార్థులను ఒక్కచోటుకు చేర్చి భిన్నత్వంలో ఏకత్వం చేయాలన్నదే యునైటెడ్ స్కూల్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (యుఎస్ఓ) లక్ష్యమని ఆ సంస్థ సెక్రటరీ నీనా జైన్ స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్ ఇస్టా కార్యాలయంలో సంస్థ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ భానుప్రకాష్, ట్రెజరర్ విజయ్‌కుమార్ నెహ్రూతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తమ సంస్థ 75 ఏళ్లుగా 31 వేల పాఠశాలల విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీస్తోందన్నారు. ఈసారి పులివెందులలో జాతీయస్థాయి స్కూల్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో 9 రాష్ట్రాలకు చెందిన 17 సంవత్సరాల లోపు పిల్లలు 150 మంది పాల్గొంటారన్నారు. ఆయా రాష్ట్రాలలోని సంస్కృతి, సంప్రదాయాలు, వేషధారణలు ప్రదర్శించనున్నారన్నారు. అలాగే వీరికి వకృత్వ, క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక విహారయాత్రలో భాగంగా గండికోట, యూసీఐఎల్‌ను సందర్శించడం జరుగుతున్నారు. పిల్లల్లోని దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏర్పాటుచేస్తున్న ఈ ఫెస్టివల్‌ను జయప్రదం చేసేందుకు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నవీన్, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లి ప్రజాసమస్యలను ప్రస్తావించాలి

● జగన్‌కు తులసిరెడ్డి సూచన


వేంపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వెళ్లి రాష్ట్రంలో ప్రజల సమస్యలను ప్రస్తా వించాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. ప్రతిపక్ష హోదా కావాలని మంకు పట్టుపట్టడం హాస్యాస్పదమని, అసెంబ్లీకి వెళ్లని పక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వేంపల్లెలో బుధవారం విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ 11 సీట్లు వచ్చిన వైసీపీకి ప్రతిపక్ష హోదా రాదని తెలిసి కూడా ఉద్దేశపూర్వకంగా జగన్ అసెంబ్లీకి వెళ్లకపోవడం ప్రజాస్వా మ్యా న్ని అవమానించడమే అన్నారు. గతంలో కాంగ్రెస్‌కు కూడా ప్రతి పక్ష హోదా ఇవ్వలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తాత్సారం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు జగన్ అసెంబ్లీకి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

పేదలకు జీఎస్టీ మినహాయించాలి

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించినా కొన్ని వస్తువులకే తగ్గింపు ధరలు అమలు అవుతున్నాయని, అందువలన రేషన్‌కార్డు ఉన్న పేదలకు జీఎస్టీ మినహాయించాలని ఏపీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో వివిధ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించకపోవడం వలన వెనుకబడిన అణగారిన వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేషన్లకు తగిన బడ్జెట్ కేటాయించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకానికి దళిత, గిరిజన మహిళలు భూమి కొనుగోలు పథకాన్ని అనుసంధానం చేసి, యూనిట్ ధరను ఎకరాకు 20 నుండి రూ.50 లక్షలకు పెంచాలన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు డానియేల్ మాదిగ, బాలలక్షుమయ్య మాదిగ, కర్ణమాదిగ, నాగభూషణం మాదిగ పాల్గొన్నారు.

పిల్లల విద్య ఆరోగ్య విషయాల పట్ల శ్రద్ధ వహించాలి


● సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్



అధికారులతో చర్చిస్తున్న జడ్జి బాబాపక్రుద్దీన్

కడప రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్యా, ఆరోగ్య విషయాల పట్ల తగు శ్రద్ధ వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా పక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని విజిట్ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను, వంట గదులను, భోజన సదుపాయాన్ని, రికార్డులను పరిశీలించారు.

అనంతరం జడ్జి మాట్లాడుతూ విద్య విలువైనదని, క్రమశిక్షణతో అభ్యసించి గురువులకు, సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2024పై వివరించారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ 14456 మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో నిర్వహించిన జిల్లా అధికారుల మానిటరింగ్ సమావేశంలో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు మొదలగు అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో కడప, రాజంపేట డివిజన్ ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులు, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.



అమ్మరూపం..అపురూపం

వైభవంగా సాగుతున్న దసరా నవరాత్రి ఉత్సవాలు ● కిటకిటలాడుతున్న ఆలయాలు



అమ్మవారిశాలలో కిటకిటలాడుతున్న భక్తులు

కడప కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రంగురంగుల విద్యుద్దీపాల వెలుగుల్లో అమ్మవారి ఆలయాలు కొత్తకాంతు లీనుతున్నాయి.

నగరంలో అమ్మవారి ఆలయాలకు క్యూకట్టిన భక్తులు..: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కుటుంబ సమేతంగా ప్రజలు అమ్మవారి ఆలయాల బాట పట్టారు.

లలితా పంచాయతన దేవాలయంలో..: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగర శివా రు ప్రాంత శ్రీలలితా పంచాయతన దేవాలయంలో అమ్మవారు గాయత్రిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

విజయదుర్గాదేవి ఆలయంలో..: శరన్నవరాత్రి ఉత్సవాల్లోభాగంగా నగర బిల్టప్ సమీప విజయ దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు చంద్ర ఘంటాదేవిగా మూడో రోజు భక్తులకు దర్శనం ఇచ్చారు. కాగా రవాణా శాఖ మంత్రి మండిపల్లిరాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత విజయ దుర్గాదేవి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో..: నగర అమ్మవారిశాలవీధిలో వెలసిన కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజ రాజేశ్వరి ఆలయంలో..: శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.







కడప విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత, అమ్మవారికి అన్నాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, గడ్డిబజారు ఆలయంలో పార్వతీదేవి అలంకారంలో అమ్మవారు

గడ్డిబజారు బాలాజీ ఆలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన శ్రీలక్ష్మి సత్యనారాయణస్వామి దేవస్థానం (బాలాజీ)లో అమ్మవారు శ్రీరాధాక్రిష్ణ ఆలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

రాజారెడ్డివీధిలో..: రాజారెడ్డివీధిలో వెలసిన గ్రామ దేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో..: నగర గడ్డిబజారులో వెలసిన కామకోటి కళాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి దేవాలయంలో అమ్మ వారు పార్వతీదేవి అలంకారం లో భక్తులకు దర్శన మిచ్చారు.

ఎరమ్రుక్కపల్లెలో..: ఎర్రముక్కపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి దేవస్థానంలో అమ్మవారు గజ లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. నగర శంకరాపురం ఎస్‌బీఐ సమీపం లో వెలసిన అమ్మవారిఆలయం లో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అలాగే సీయోనుపురం (రాజారెడ్డివీధి)లో వెలసిన శ్రీశక్తిసవారమ్మ అవ్వ దేవస్థానంలో అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నగర చిన్న బెస్తవీధిలో వెలసిన బాల పోలేరమ్మ దేవస్థానంలో అమ్మ వారు పార్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. హనుమప్ప వీధిలో వెలసిన శ్రీభద్రావతి సమేత భావనా రుషి ఆలయంలో అమ్మవారు శ్రీవినాయకి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



పెండ్లిమర్రి పొలతలలో మహాలక్ష్మీదేవి అలంకరణలో పార్వతీదేవి అమ్మవారు

దేవునికడప ఆలయంలో..: దేవునికడప శ్రీలక్ష్మి వేంకటేశ్వరుని ఆలయంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుమలేశుడు చిన్నప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

వల్లూరు..: దసరా శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం వల్లూరు మండలంలోని వల్లూరులో వాసవీ కల్యాణమండపంలో శ్రీ గజలక్ష్మీదేవి ఆలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.

సింహాద్రిపురం..: దసరా ఉత్సవాల్లో భాగంగా పాతూరు చౌడేశ్వరి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కమలాపురం రూరల్..: పట్టణంలోని అమ్మవారిశాలలో బుధవారం రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వేంపల్లె..: అమ్మవారిశాలలో కన్యకా పరమేశ్వరిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పూజలు చేశారు.

చెన్నూరు..: చెన్నూరులోని వాసవీ మాత ఆలయం లో అమ్మవారిని మీనాక్షిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. తూర్పువీధిలోని మాతమ్మ దేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం కల్పించారు.

పెండ్లిమర్రి..: పొలతల మల్లికార్జున స్వామి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం పార్వతీదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



నడివీధిగంగమ్మతల్లి ఆలయంలో అన్నపూర్ణదేవి అలంకారంలో అమ్మవారు



ఎర్రముక్కపల్లె చౌడేశ్వరిదేవి ఆలయంలో గజలక్ష్మీదేవి ఆలంకారంలో అమ్మవారు, వల్లూరులో గజలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



సింహాద్రిపురం, వేంపల్లిలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు



కమలాపురంలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు, చెన్నూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మీనాక్షి దేవి అలంకారం

కార్మికులకు అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలి

కడప, నాగరాజుపేట,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్రిమెంట్ ప్రకారం కార్మికులకు రూ.18600 ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.12వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, సీఐటీయూ నగర అధ్యక్షుడు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

27న మండల సర్వసభ్య సమావేశం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న శనివారం ఉదయం 11 గంటలకు సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీడీఓ తెలిపారు.

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

సీకేదిన్నె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సైబర్ క్రైం హెడ్‌కానిస్టేబుల్ సూర్యప్రకాష్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బారత్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు శక్తియాప్ ఉపయోగాలను, పోక్సో చట్టం, పిల్లల భద్రత, బాల్య వివాహాలు నిర్వహణ, ఈవ్‌టీజింగ్ వేదింపులు తదితర అంశాలపై అవగాహన కలించారు. కార్యక్రమంలో శక్తి టీం సిబ్బంది, కానిస్టేబుల్ సహదేవరెడ్డి పాల్గొన్నారు.

పశుగ్రాసం విత్తనాలు మంజూరు

పెండ్లిమర్రి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు పశుగ్రాస విత్తనాల మంజూరు అయినట్లు పశువైద్యాధికారి రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా నందిమండలం గ్రామంలోని పశువైద్యశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ 5 కేజీల ప్యాకెట్ విలువ రూ.120లని రైతులు ఆధార్‌కార్డ్ జిరాక్స్ తీసుకుని సమీపంలోని పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయిస్తే పంటల పొలాలకు అవసరమయ్యే పోషకాలను అందించవచ్చని కమలాపురం వ్యవసాయ సంచాలకుడు ఏపీ నరసింహారెడ్డి అన్నారు. బుధవారం కొమ్మద్ది గ్రామంలో ఏవో శ్యామ్‌బాబుతో కలిసి పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెన్షన్.. తర్వాత షోకాజ్ నోటీస్

● ఇదీ పులివెందుల రెవెన్యూ తీరు

పులివెందుల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరిగా పనిచేయలేదంటే ముందు షోకాజ్ నోటీసు ఇస్తారు. వారి సంజాయిషీ సరిగా లేకుంటే తర్వాత సస్పెండ్ చేస్తారు. కానీ పులివెందుల రెవెన్యూ అధికారులు మాత్రం దీనికి భిన్నం. వివరాలిలా..తొండూరు మండలంలోని భద్రంపల్లె గ్రామంలో డీలర్ సుహాసినికి చెందిన రేషన్‌షాప్‌ను ఈనెల 9వ తేదీ సాయంత్రం ఆర్డీఓ చిన్నయ్య విజిట్ చేశారు. ఆ సమయంలో ఉండాల్సి న దానికంటే బియ్యం 68 కిలోలు, చక్కెర 45ప్యాకెట్లు తక్కువ ఉన్నాయంటూ డీలర్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 17వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. కానీ మరుసటి రోజు 18వ తేదీ రేషన్‌షాప్‌ను విజిట్ చేసిన సమయంలో బ్యాలెన్స్ హెచ్చుతగ్గులకు తగిన వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు. దీనిపైన ఆర్డీఓ చిన్నయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ముందు సస్పెండ్ చేయచ్చు తర్వాత షోకాజ్ నోటీసు ఇవ్వచ్చు అని ఆర్డీఓ అన్నారు. ఈ చిన్న విషయాన్ని పేపర్‌లో రాయడం ఎందుకని సమాధానమిచ్చారు.

'పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

భాగవత పఠకులు వినతిపత్రం అందజేత

లింగాల,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భాగవత పఠకులపై అనుచత వ్యాఖ్యలు చేసిన లోపట్నూతల పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి, పోలీస్‌స్టేషన్‌లో బుధవారం లోపట్నూతల గ్రామస్థులు, భాగవత పఠకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా లోపట్నూతల గ్రామంలో భాగవత పఠన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంపై సమయం, సందర్భం లేకుండా భాగవత పఠనం నిర్వహిస్తున్నారని, వారం రోజులు భోజనం గడచి పోతుందని, ముసలివాళ్ల ఊర్లు తిరుగుతూ బుద్ధి, జ్ఞానం లేకుండా ప్రవర్తిస్తున్నారు,అన్నదానం చేసిన కుటుంబాలు సర్వనాశనం అవుతాయంటూ అనుచిత వ్యాఖ్యలు చేసి వాట్సప్‌గ్రూప్‌లో శ్యామ్‌సుందర్‌రెడ్డి పోస్ట్ చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. ఇందుకు సంబంధించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ కార్యదర్శిని వెంటనే సెలవుపై వెళ్లాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగిఉండాలి

వేంపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని,పెద్దయ్యాక పదిమందికి సహాయ పడాలని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త సూచించారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు తిరుపతిరెడ్డి,గోవర్ధన్, సుబ్బరాయుడు, అరుణ్, అనిత, కోనప్ప, పవన్ తదితరులు పాల్గొన్నారు.

దేశ పురోగతికి సేవ చేయాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశ పురోగతికి ప్రతి విద్యార్థి తనవంతు సేవ చేయాలని పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,2 ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో ఎన్ఎస్ఎస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత, ఎన్.శ్రీనివాసరెడ్డి ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతో పూణే ఒప్పంద ఉల్లంఘునకు చెక్ పెడదాం

కడప మారుతీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ మధ్య పూణెలోని ఎర్రవాడ జైలు ప్రాంగణంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని చరిత్రలో పూణె ఒప్పందంగా ప్రసిద్ధిచెందిందని, ఈ ఒప్పందంతో నిమ్న జాతి ప్రజలు తీవ్రంగా నష్టపోయిన దుస్థితి ఏర్పడిందని దీని నుంచి బయట పడాలంటే రాజ్యాధికారం శరణ్యమని పలు పార్టీల ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. ఎస్సీఎస్టీ మానవ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ ఒప్పందంతో అణగారిన వర్గాల భవిష్యత్తు అంధకారం అయిందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీబీపీ) జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, అంబేడ్కర్‌మిషన్ ప్రధాన కార్యదర్శి ఎ.సంపత్‌కుమార్, హేతువాదం సంఘం జిల్లాకన్వీనరు సీఆర్వీ ప్రసాద్, మహారాజ్యంపార్టీ జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్, ఎస్సీ, ఎస్టీ మానవహక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకుడు జేవీ రమణ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ భారత్ మహోత్సవం

కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో బుధవారం దాస్ ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ మహోత్సవ్ ఉత్పత్తిదారులచే నేరుగా అమ్మకాలు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ సొసైటీ ఛైర్మన్, అడ్వకేట్ ఓబుల్‌దాస్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట జడ్జి , పోక్సో జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రత్యూష, లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ దాస్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ హస్తకళల వస్తువులు, చేనేత వస్త్రాలు స్వయం సహాయకసంఘాల ద్వారా తయారు చేయబడిన వివిధ ఉత్పత్తు ప్రదర్శన అమ్మకాలు, ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం విజయవిహారి, రిటైర్డ్ ఏపీజీబీ మేనేజరు జానమద్ది విజయభాస్కర్, జె.సురేశ్ సహాయం, షేక్ అరుణ్, దీపిక పాల్గొన్నారు.

ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాల్సిందే



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాల్సిందేనని కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు.నిర్లక్ష్యం వహిస్తే చర్యలుతప్పవని హెచ్చరించారు. బుధవారం ఆయన ఈస్ట్, సౌత్ జోన్‌లలో ఆకస్మిక పర్యటనలు నిర్వహించారు. ఉక్కయ్యపల్లె ఎకో పార్క్‌ను పరిశీలించి ప్రజలకు ఉపయోగపడేలా వెంటనే చర్యలు చేపట్టాలని లేదంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని అధికారులకు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

'చంద్రబాబు మాదిగల పెద్దన్న'

కడప మారుతీనగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబునాయుడు మాదిగల అభ్యున్నతి కోసం ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో బిల్లు ఆమోదం చేసి తద్వారా మాదిగలకు పెద్దన్నగా నిలిచారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెదురూరు బాబు కొనియాడారు. బుధవారం స్థానిక కాగితాలపెంటలో గల ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సమితి ముఖ్య కార్యకర్తల సమావేశంలో నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా, నగర కమిటీ అధ్యక్షుడిగా సునీల్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.రాజు, గౌరవాధ్యక్షుడుగా చిన్నసుబ్బయ్య, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలన్నదే అంగీకార్ ఉద్దేశ్యం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇల్లులేని ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించాలన్నదే అంగీకార్ ఉద్దేశ్యమని మున్సిపల్ కమిషనర్ రాముడు అన్నారు. బుధవారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో అంగీకార్-2025 పోస్టర్లను ఆవిష్కరించారు. కమిషనర్ మట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. హౌసింగ్ ఏఈ రామసూరారెడ్డి, సీఎల్‌టీసీ రామచంద్రారెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు విజిబుల్ పోలీసింగ్

కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతున్నారు. వాహన తనిఖీలు, సైబర్ నేరాలపై అవగాహన, రహదారి భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు.

ఎస్పీని కలిసిన సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

కడప క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ నచికేత్‌ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కడప గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ కమిటీ సభ్యులు కలిశారు. మహిళా పోలీసుల సమస్యలు వారికి సంబంధించిన అనేక సమస్యలపై ఎస్పీకి కలిసి వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చిన్నమస్తాన్, లక్ష్మణ్, కన్వీనరు మస్తాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సింహాద్రిపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం సింహాద్రిపురంలో అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలతో కలసి తుంగభద్ర హైలెవెల్ కెనాల్ ఛైర్మెన్ మారెడ్డి జోగిరెడ్డి ప్రారంభించి, లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 32 చౌకదుకాణాల పరిధిలో పంపిణీ చేసేందుకు 9281 స్మార్ట్ కార్డులు సిద్ధంగా ఉన్నట్లు తహసీల్దార్ వెంకట సాయినాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరిబాబు, వీఆర్వో పుష్పరాజు, టీడీపీ నేతలు పుష్పాల శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పీజీ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



మధ్యంతర భృతి ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

బద్వేలురూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు దసరా కానుకగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, అలాగే 12వ వేతన సవరణ అమలుకు కమిషనరు, సిబ్బందిని నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యాయులు రామక్రిష్ణ, సీవీ రమణ, సుబ్బరాజ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ప్రారంభం



పెట్రోలుబంకును ప్రారంభిస్తున్న సీతా బ్రదర్స్, వారి కుటుంబ సభ్యులు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలోని సిద్దయ్యగారి మఠం ఆర్చి దగ్గర శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌ను బుధవారం సీతా సురేశ్ అతని సోదరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పరిసర ప్రాంత గ్రామాల ప్రజలకు, వాహనదారులకు అనుకూలంగా ఉండేందుకు ప్రారంభించామన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వాహనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, రోడ్డు రవాణాశాఖ డెవలప్‌మెంటు డైరెక్టరు రంతు, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, బ్రహ్మయ్య, షరీఫ్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్‌డే వేడుకలు

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్‌డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిహెచ్.శ్రీనివాసప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇందిర, డాక్టర్ రాజాకిశోర్ తదితరులు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరు : అమ్మవారిశాలలో వాసవీమాతను దర్శించుకుంటున్న భక్తులు, శివాలయంలో భవానీదేవిగా అమ్మవారి దర్శనం, ఖాజీపేట: రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు

శారదాదేవీ... పాహిమాం

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలు సందర్భంగా మూడవ రోజు అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. బుధవారం అమ్మవారిశాలలో రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో, శారదాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. పాత మార్కెట్‌లోని చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మి అలంకారంలో దర్శనమివ్వగా, వెంకటేశ్వర్లుపేటలో చౌడేశ్వరీదేవి ఆలయంలో, శివాలయంలో భవానీదేవి అలంకారం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

అలాగే జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, బద్వేలు, పోరుమామిళ్ల, మైదుకూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, కలసపాడు మండలాల్లోనూ దేవీ నవరాత్రుల సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆ తల్లిని వేడుకొన్నారు.



జమ్మలమడుగు: గజలక్ష్మీదేవి అలంకారం



బద్వేలు: అమ్మవారిశాలలో అన్నపూర్ణాదేవి అలంకారం






ప్రొద్దుటూరు: ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శారదాదేవిగా, చౌడేశ్వరీదేవి ఆలయంలో భవానీదేవిగా, చెన్నకేశవస్వామి ఆలయంలో ధైర్యలక్ష్మిగా, ఎర్రగుంట్ల: చౌడేశ్వరీదేవి ఆలయంలో భవానిదేవి అలంకారంలో అమ్మవారు



కలసపాడు: ధనలక్ష్మిదేవి అలంకారం

ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి

కొండాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో నాగప్రసాద్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు మనోహర్‌బాబు, నాగసుబ్బరాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి

పెద్దముడియం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజనులో వేసిన పంటలకు ఈ నెలాఖరులోగా పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి జాకీర్ హుసేన్ రైతులను కోరారు. బుధవారం వ్యవసాయాధికారి మాట్లాడుతూ మండలంలో పంట నమోదు ఇప్పటికి 3440 ఎకరాల్లో చేశామని తెలిపారు.

చిరు వ్యాపారులకు వరం.. పీఎం స్వానిధి

బద్వేలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పలువురు చిరు, పేద వ్యాపారులకు లోక కళ్యాణ పీఎం స్వానిధి ఒక వరం లాంటిదని ఆర్డీవో చంద్రమోహన్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్‌లు అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని పట్టణ పీహెచ్‌సీ వద్ద లోక కళ్యాణపీఎం స్వానిధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ వ్యవస్థాపకత, ఆర్థిక అక్షరాస్యత డిజిటల్ నైపుణ్యాలు మార్కెటింగ్‌పై దృష్టి సారిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటిసారి రూ.15 వేలు, రెండవ సారి రూ.25 వేలు, మూడవసారి రూ.50 వేలు వీధి విక్రయదారులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిరు వ్యాపారుల కోసం పేటీఎం స్కానర్ సౌకర్యాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 11వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. అక్టోబరు 6, 7 తేదీల్లో పల్నాడు జిల్లా సత్యనపల్లిలో ఈ మహాసభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభల కరపత్రాలను జమ్మలమడుగు బీసీ కాలనీలో ఆవిష్కరించారు.

ఈ-క్రాప్ చేయించుకోవాలి

మైలవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసిన రైతులు నెలాఖరుకు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి గురుభాస్కర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని వేపరాల, లింగాపురం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సూపర్‌వైజర్ సుబ్బరామయ్య, వీఏఏలు మాధవరెడ్డి, ప్రియాంక, రమణి పాల్గొన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- చైర్‌పర్సన్‌గా వద్దిసురేఖ, వైస్ చైర్మన్‌గా పట్నం లక్ష్మణ్‌లు



ప్రమాణస్వీకారం చేస్తున్న సురేఖ, లక్ష్మణ్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వద్దిసురేఖ, వైస్‌చైర్మన్‌గా పట్నం లక్ష్మణ్ తోపాటు డైరెక్టర్లతో వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రమాణ స్వీకారం చేయించారు. బుధవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏఎంసీ పాలకమండలి ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్‌కమిటీ బీసీ మహిళకు సీఎం చంద్రబాబు కేటాయించడం హర్షనీయమన్నారు. వ్యవసాయదారులకు మార్కెట్ కమిటీ అండగా వుండాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ మాజీ కౌన్సిలర్ వద్ది బాలుడు తదితరులు పాల్గొన్నారు.

దసరా ఎగ్జిబిషన్‌తో ప్రజలకు వినోదం: ఎమ్మెల్యే



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, సురేష్‌నాయుడు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ అనిబిసెంట్ హైస్కూలు గ్రౌండ్‌లో నిర్వహించే దసరా ఎగ్జిబిషన్‌తో ప్రతి ఏడాది ప్రజలకు మంచి వినోదం అందుతుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపల్ హైస్కూలు గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆసం రఘురామిరెడ్డి, వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, ఎగ్జిబిషన్ కాంట్రాక్టర్, టీడీపీ మండల నాయకుడు మాడెం సుధాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఈసీ నిర్లక్ష్య వైఖరిని వీడాలి

- ఎన్‌డీ విజయజ్యోతి



సంతకాల సేకరణలో ఎన్‌డీ విజయజ్యోతి

కాశినాయన, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దొంగ ఓట్లు తొలగించడంలో ఈసీ నిర్లక్ష్య వైఖరి వీడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పేర్కొన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలపై దేశ వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలా ఆదేశాల మేరకు కాశినాయన మండల కేంద్రమైన నర్సాపురంలో మండల బాధ్యుడు పుల్లూరు పెద్దఖాజావలి అధ్యక్షతన సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఓటర్ల జాబితా విషయంలో అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు డా.అన్వర్, నాయకులు రామిరెడ్డి, పుల్లూరు బాషా, చిన్నరామిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రజలకు తెలియకుండా వేసుకుని దొంగదారిన గద్దెనెక్కిన బీజేపీని దించి రాహుల్‌ను ప్రధానమంత్రిని చేయాలని మైదుకూరులో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గుండ్లకుంట శ్రీరాములు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని కడప రోడ్డు నుంచి రాయల కూడలి మీదుగా బద్వేల్ రోడ్డు వరకు పాదయాత్ర చేస్తూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ బీజేపీ దొంగ ఓట్లను వేసుకుని మూడుసార్లు అధికారం చేపట్టామని జబ్బలు చరుచుకుంటోందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పలు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత ప్రగతిని సాధించాలి

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత ప్రగతిని సాధించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గురుమూర్తిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో కడపకు చెందిన వైవీనాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందజేశారు. 46 మంది విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ.2 వేలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ దాతల సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రస్టు చైర్మన్ వినయ్‌కుమార్, వైస్‌చైర్మన్ సునీత, కోశాధికారి సాయివేణుగోపాల్ పాల్గొన్నారు.

సేవాభావం కలిగి ఉండాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సామాజిక సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.త్రివిక్రంరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం ఎర్రగుంట్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డేని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సేవాస్ఫూర్తి, క్రమశిక్షణ తప్పనిసరిగా పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంటెప్ప, టి.వేణుగోపాల్, నగమహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులపై చర్యలు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ కొండారెడ్డి హెచ్చరించారు. బుధవారం వాహనాల తనిఖీలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.

ఆక్రమణకు రాచమల్లే కారణం

- టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్



ప్రొద్దుటూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహర్షి స్కూలు ఆక్రమణ కావడానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డే కారణమని టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ భూమి కొనుగోలు చేసిన వ్యక్తితో రాచమల్లు ఆయన సోదరుడు కిరణ్‌రెడ్డి బేరాలు ఆడి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. తాను చెప్పింది నిజం కాకపోతే ఈ విషయంపై కోర్టులో పిల్ వేయాలని సవాల్ విసిరారు.

ఎంపీడీవోగా సుబ్బారెడ్డి



దువ్వూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ అభివృద్ధి అధికారిగా ఎ.సుబ్బారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన మైదుకూరు నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకం ఏపీడీగా బాధ్యతలు నిర్వహిస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో అన్ని శాఖల ఉద్యోగులు పరిపాలన పరంగా సహకరించాలని కోరారు.


నూతన కమిటీ ఏర్పాటు

చాపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని ప్రభుత్వ గ్రంథాలయానికి బుధవారం నూతన కమిటీని నియమించినట్లు గ్రంథాలయ లైబ్రేరియన్ శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. అధ్యక్షుడిగా కరిముల్లా, కార్యదర్శిగా వెంకటసుబ్బారెడ్డి, కోశాధికారిగా మహమ్మద్ రఫీ, సభ్యులుగా పోలయ్య, సుబ్బరాయుడు, స్నేహ, గురుస్వామి, సురేంద్ర, గోపాల్‌లను నియమించామన్నారు.

మహిళల్లో చైతన్యం రావాలి

ఖాజీపేట, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మహిళల్లో చైతన్యం వస్తేనే ఆయా గ్రామాల్లో చైతన్యం వస్తుందని వ్యవసాయ శాఖాధికారి నాగార్జున అన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలను స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శైలజ, సీసీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్‌గా రవీంద్రారెడ్డి



కాశినాయన, సెప్టెంబరు 24: బద్వేలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా మండలంలోని గంగనపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డి రవీంద్రారెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ సమన్వయకర్త రితీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మిక హక్కులను కాలరాయద్దు'

బద్వేలు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాసేలా వ్యవహరించడం సరికాదని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు జకరయ్య, సీహెచ్ నారాయణలు హెచ్చరించారు. బుధవారం స్థానిక సీపీఐఎంఎల్ కార్యాలయ ఆవరణలో సుమో, ఆల్విన్, హమాలి, కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. పలువురు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి వద్దకు వెళ్లి పీ4 సర్వే చేయించి వారి స్థితిగతులు కనుగొనాలని ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీవో పీ4పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామసచివాలయ సిబ్బంది అందరూ ఇచ్చిన లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు.